వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 314 | సోమవారం | 01 జూలై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



## మంత్రి సురేఖను కలిసిన ముఖ్య కార్యదర్శి రవి

తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కొత్త మెంబర్ సెక్రటరీగా నియమితులైన జి.రవి సోమవారం సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ముఖ్య కార్యదర్శి రవికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పరిధిలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు, నిధులు, కేంద్ర ప్రభుత్వ సహకారం తదితర అంశాలపై మంత్రి సురేఖ ముఖ్య కార్యదర్శితో చర్చించారు.

- వరంగల్ వాయిస్, హైదరాబాద్

# ఇకపై.. స్వదేశీ న్యాయవ్యవస్థ



- నేటి నుంచి కొత్త చట్టాల అమలు
- సత్వర, వేగవంతమైన న్యాయమే లక్ష్యం
- నూతన చట్టాలపై అవగాహన ముఖ్యం
- కొన్ని విషయాల్లో సంక్లిష్టత

బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు ముగింపు పలుకుతూ వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. నేర నియంత్రణ, వేగంగా శిక్షలు పడేలా కేంద్ర ప్రభుత్వం సరికొత్త చట్టాలను అమల్లోకి తీసుకువచ్చింది. ఇకపై బాధితులకు సత్వర, వేగవంతమైన న్యాయం జరుగుతుంది. “స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తరువాత స్వదేశీ న్యాయ వ్యవస్థ అమల్లోకి వచ్చింది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ ఎస్) 2023, క్రిమినల్ ప్రొసీసర్ (సీఆర్ పీసీ)స్థానంలో భారతీయ నాగరిక సురక్ష సంహిత(బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ)కు బదులుగా భారతీయ సాక్ష్య అధినిలయం (బీఎస్ఏ) అమల్లోకి తెచ్చింది. వలస రాజ్యాల చట్టాల స్థానంలో భారత పార్లమెంటు రూపొందించిన ఈ చట్టాలు ఎన్నో రకాలుగా ఆలోచించి తెచ్చారు. ఈ చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం, ఇప్పటి వరకు ఉన్న పోలీసుల హక్కులతో పాటు బాధితుల, ఫిర్యాదుదారుల హక్కులు కూడా రక్షించబడతాయి.

- వరంగల్ వాయిస్, వరంగల్



8లో

## స్మార్ట్ సిటీ పనుల గడువు పొడగింపు కేంద్రం ఉత్తర్వులు జారీ

కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌కు కృతజ్ఞతలు

వరంగల్ ఎంపీ కడియం కావ్య

## వైద్య రంగానికి పెద్ద పీట

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లకు శుభాకాంక్షలు

పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



8లో..

## మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

జనగామ కలెక్టరేట్‌లో కలకలం



8లో..




8లో..

## ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

# ఇకపై స్వదేశీ న్యాయ వ్యవస్థ



**నేటి నుంచి కొత్త చట్టాల అమలు**
**సత్వర, వేగవంతమైన న్యాయమే లక్ష్యం**
**నూతన చట్టాలపై అవగాహన ముఖ్యం**
**కొన్ని విషయాల్లో సంక్లిష్టత**



భారతదేశ నేర న్యాయ వ్యవస్థ, నేరాల దర్యాప్తు, విచారణ ప్రక్రియలో ఈ కొత్త చట్టాలు వేగం తీసుకురానున్నాయని, ఒక ఆధునిక న్యాయ వ్యవస్థను అందించనున్నాయని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కొత్త చట్టాల్లో జీరో ఎఫ్ఐఆర్, ఆన్‌లైన్‌లో పోలీసులకు ఫిర్యాదు, ఎంఎస్ఎం వంటి ఎలక్ట్రానిక్ మోడ్ విధానంలో సమన్లు జారీ, అతి క్రూరమైన నేరాల క్రైమ్ సీన్‌లను వీడియోగ్రఫీ చేయడం వంటి నిబంధనలు ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి చట్టాల మాదిరిగా కాకుండా కొత్త చట్టాలు ప్రజలకు న్యాయం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తాయని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా గతంలో చెప్పారు.

## వెసులుబాట్లు ఇవీ..

బాధితులు పోలీస్ స్టేషనుకు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చు. పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయొచ్చని చట్టం చెబుతోంది. దీనిని జీరో ఎఫ్ఐఆర్ గా పరిణిస్తారు. శిక్ష కన్నా న్యాయం అందించడం ప్రధాన లక్ష్యమని ఈ చట్టాలు చెబుతున్నాయి. మూక హత్యను తొలిసారిగా నిర్వచించారు. వ్యవస్తీకృత నేరాలపై కొత్త అధ్యాయాన్ని ప్రవేశ పెట్టారు. ఉదాహరణ కు సమాజంలో మూక దాడులు, మహిళలు, చిన్నారులపై నేరాల దర్యాప్తు చేసి కఠినంగా వ్యవహరించి 2 నెలల్లో పూర్తి చేయాలని నూతన చట్టం చెబుతోంది. ఇక వీడియో సాక్ష్యాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు చెల్లుబాటులోకి వస్తాయి. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో సుమారు 120 సంవత్సరాల నుంచి వస్తున్న పాత చట్టాలు ప్రస్తుతం సమాజ స్థితులకు అనుగుణంగా లేవని డాక్టర్ రణబీర్ సింగ్ కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు భారత దేశ న్యాయ వ్యవస్థలో మార్పులు తీస్కొని రావడమే లక్ష్యంగా కేంద్రం నూతన చట్టాలు తీసుకొచ్చింది.

## కొత్త చట్టాలపై అవగాహన ముఖ్యం..

నేటి నుంచి పోలీస్ స్టేషన్లలో కొత్త నేర న్యాయ చట్టాలు (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి. బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పరిశీలించి ఏ సెక్షన్ వర్తిస్తుందో తెలుసుకొని కేసులను నమోదు చేసి విచారణ చేపట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి నెల రోజుల పాటు కొత్త చట్టాలపై నిపుణులతో శిక్షణ ఇప్పించారు. దాదాపు 2000కు పైగా కొత్త చట్టాలపై అవగాహన సదస్సులో శిక్షణ తీసుకున్నారు. ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా బీఎన్ఎస్ లో 358కి తగ్గించారు. కొత్త చట్టంలో పోలీసులకు విస్తృతమైన అధికారులు ఉండటంతో కొంత ఇబ్బందులు వచ్చే అవకాశాలు లేకపోలేదు.

## కొత్త చట్టాల్లోని కీలక నిబంధనలు..

మైనర్‌పై సామూహిక లైంగిక దాడికి పాల్పడితే మరణ శిక్ష లేదా జీవిత ఖైదు నిబంధన ఉంది. పిల్లలను అమ్మడం లేదా కొనడం క్రూరమైన నేరంగా పరిగణించారు. జీరో ఎఫ్ఐఆర్ విధానంతో ఒక వ్యక్తి పోలీసుస్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఏ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా ఏదైనా ఘటనను రిపోర్టు చేయడంలో లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించడంలో ఆలస్యాన్ని నివారించొచ్చు. ఏదైనా ఘటనను ఒక వ్యక్తి ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు వీలుంది. పోలీసుస్టేషన్‌కు వ్యక్తిగతంగా వెళ్లాల్సిన అవసరం లేదు. దీని ద్వారా వేగవంతమైన ఫిర్యాదు ద్వారా అదే వేగంతో పోలీసులు తగిన చర్యలు తీసుకొనే వెసులుబాటు ఉంటుంది. ఎలక్ట్రానిక్ రూపంలో సమన్లు జారీ చేయవచ్చు. దీని ద్వారా చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు పేపర్ వర్క్‌ను తగ్గిస్తుంది. లైంగిక దాడి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆమె సంరక్షకురాలు లేదా బంధువు సమక్షంలోనే ఒక మహిళా పోలీసు అధికారి రికార్డు చేయాలి. వారం రోజుల్లోగా వైద్య నివేదిక రావాలి. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి.. బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచాలి. ఏదైనా కేసులో నిందితులు, బాధితులు 14 రోజుల్లోగా ఎఫ్ఐఆర్, పోలీసు రిపోర్టు, చార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్ల కాపీలను పొందవచ్చు. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన తర్వాత 45 రోజుల్లోగా తీర్పు ఇవ్వాలి. విచారణ ప్రారంభమైన 60 రోజుల్లోగా అభియోగాలు నమోదు చేయాలి. కేసు విచారణలో అనవసర జాప్యాలను నివారించేందుకు, సకాలంలో న్యాయం అందించేందుకు న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి. సాక్షుల భద్రతను, వారి సమాచారాన్ని దృష్టిలో ఉంచుకొని సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలి. రాజద్రోహం స్థానంలో దేశద్రోహం అనే పదాన్ని చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యలను నిర్వచించారు. ఏదైనా కేసులో చేపట్టే తనిఖీలు, స్వాధీనాలను వీడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి. వివాహం పేరుతో మోసం చేయడం, మైనర్లపై సామూహిక లైంగిక దాడికి పాల్పడటం, మూక హత్యలు, చైన్ దొంగతనాలు వంటి ఘటనలకు పరిష్కరించేందుకు ప్రత్యేక నిబంధనలు. అరెస్టు సందర్భాల్లో బాధితులు తమ పరిస్థితి గురించి సమాచారాన్ని బంధువులకు లేదా స్నేహితులకు తెలియజేసే హక్కు ఉంటుంది. తద్వారా అరెస్టయిన వ్యక్తి తక్షణ సాయం పొందే వీలుంటుంది. అరెస్టు వివరాలను ప్రముఖంగా పోలీసుస్టేషన్లు, జిల్లా కేంద్రాల్లో డిస్‌ప్లే చేయాలి. దీని ద్వారా అరెస్టయిన వ్యక్తి బంధువులు, స్నేహితులు ముఖ్యమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చు. దర్యాప్తును బలోపేతం చేయడంలో భాగంగా తీవ్రమైన నేరాల విషయంలో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా ఘటనాస్థలికి వెళ్లి ఆధారాలు సేకరించాలి. మహిళలపై నేరాల కేసుల్లో బాధితులు తమ కేసు పురోగతిపై 90 రోజుల్లోపు ఎప్పటికప్పుడు సమాచారం పొందేందుకు అర్హులు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో బాధితులకు అన్ని దవాఖానల్లో ఉచితంగా ప్రథమ చికిత్స లేదా వైద్య చికిత్స. మరింత భద్రత కల్పించడం, దర్యాప్తులో పారదర్శకతను అమలు చేయడంలో భాగంగా లైంగిక దాడి కేసుల్లో బాధితురాలి స్టేట్‌మెంట్‌ను ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి. మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, 15 ఏండ్లలోపు పిల్లలు, 60 ఏండ్ల పైబడిన వృద్ధులు పోలీసుస్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు నివాసం ఉంటున్న చోటే పోలీసుల సాయం పొందొచ్చు.

## కొన్ని విషయాల్లో సందిగ్ధత..

ఏవైనా నేరాలు కొత్త చట్టం అమలులోకి రావడానికి ముందు... అంటే 2024 జూన్ 30కి ముందు మొదలై, అమలులోకి వచ్చిన తర్వాత అంటే 2024 జులై 1 తర్వాత కూడా కొనసాగుతుంటే, బహుళ నేరాలకు పాల్పడిన వ్యక్తులపై చివరి కేసు నమోదైన తేదీనే పరిగణనలోకి తీసుకోవాలి. 2024 జూన్ 30 లోపు నేరం జరిగి, జులై 1 తర్వాత అది బయటపడితే.. నేరం జరిగిన సమయమే ప్రామాణికం. అంటే పాత చట్టం ప్రకారమే కేసు నమోదు చేయాలి. దర్యాప్తు అధికారులు, న్యాయవాదులు, న్యాయస్థానాలను గందరగోళానికి గురిచేసే విషయమిది. పాత చట్టాల కింద నమోదైన కొన్ని కేసులు నెలల తరబడి దర్యాప్తు కొన్నేళ్లపాటు విచారణ జరిగే అవకాశం ఉంది. దీంతో దర్యాప్తు అధికారులు పాత, కొత్త చట్టాలపై సమగ్ర అవగాహనతో ఉండాలి. రెండు రకాల కేసులు కలిపి దర్యాప్తు, న్యాయవిచారణ జరిపే సమయంలో సంక్లిష్టత ఎదురయ్యే ఛాన్స్ ఉంది. పోలీసు కంప్యూటర్ వ్యవస్థలో జులై 1 నుంచి కొత్త చట్టాలకు అనుగుణంగా మార్పులు చేసినందున.. పాత కేసుల దర్యాప్తులో సమస్యలు తప్పకపోవచ్చని సిబ్బంది చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్ పూర్తికాలేదు. ఇటువంటి చోట పరిస్థితి ఏమిటన్నది స్పష్టత రాలేదు. దర్యాప్తు అధికారులు తమకు కావాల్సినప్పుడు పాత పత్రాలు, సాక్ష్యాల వంటివి డిజి లాకర్ ద్వారా ఎలా చూసుకోవాలన్న అంశంలోనూ స్పష్టత లేకపోవడం కూడా కొంత గందరగోళ పరిస్థితే. చిన్నచిన్న నేరాలకు సామాజిక సేవలు చేయించడం వంటి శిక్షలు విధించవచ్చు. కానీ, ఎలాంటినేరాలకు ఎలాంటి శిక్షలు విధించాలన్న దానిపై స్పష్టత లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడవచ్చు.

# వరంగల్ పురోగతికి కట్టుబడి ఉన్నాం

**కట్టుదిట్టమైన కార్యాచరణ అమలు చేయాలి**
**సీఎంను కోరిన మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** వరంగల్ పర్యటనతో జిల్లా ప్రజలకు గొప్ప భరోసాను కల్పించినందుకుగాను అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న వరంగల్ నగర ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, నగర పురోగతికి కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సీఎంను కోరారు. వరంగల్ మహానగర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అభివృద్ధి పనులను సమీక్షించేందుకు గాను తాను మరోసారి వరంగల్ పర్యటనకు వస్తానని సీఎం తెలిపారు. వరంగల్ పురోగతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

# నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం

**– వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝూ**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేర న్యాయ వ్యవస్థను సంస్కరించడానికి, కొత్తగా రూపొందించిన మూడు చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ) నేటి అమలులోకి వస్తాయని వరంగల్ పోలీస్ కమిషన్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ఆఫ్ 1872 స్థానంలో ఈ చట్టాలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కోసం సోమవారం పోలీస్ కమిషనరేట్ లో జర్నలిస్టులతో సమావేశం నిర్వహించి వాటి గురించి వివరించారు. అప్పటికే కొత్ చట్టాలపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అధికారులకు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. నేటి నుంచి కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్లో కొత్త చట్టాలతో కూడి సెక్షన్లతో ఫిర్యాదు నమోదు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశం లో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సీసీఆర్ బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇన్ స్పెక్టర్లు పుల్లాల కిషన్, శ్రీధర్ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

### బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**వరంగల్ వాయిస్, బల్దియా :** గ్రీవెన్స్ (ప్రజావాణి ) కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రదాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. హైద్రాబాద్ ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీకి సంబంధించిన వినతులపై ప్రత్యేక చొరవ చూపి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నగర పర్యటన విజయవంతం కావడంలో అధికారులు సిబ్బంది తమ వంతు పాత్ర పోషించారని అభినందించారు. ఈకార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డా.రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, టీపీఆర్ఓ కోలా రాజేష్ కుమార్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి డి.పార్థ సారథి, ల్యాదల్ల శరత్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శారద దేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా డి.పార్థ సారథి, ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ.7వేల కోట్ల పైచిలుకు స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయకపోవడం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు చదివిన కళాశాలలో తమ కోర్సు పూర్తి చేసిన కూడా వారి సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని, దీనిద్వారా ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందికరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మౌటం శివ కుమార్, సంతోష, మేకల అభిరామ్, ప్రభాస్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ బీసీ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో బీసీ భవన్ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులు ఎలాంటి పనులు లేక తీవ్ర నిరాశ, నిస్పహతలకు గురవుతున్నారని, రెండు సంవత్సరాల క్రితం వెనుకబడిన తరగతులకు చెందిన బీసీ నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ రుణాల కోసం అప్లికేషన్ పెట్టుకున్నారని, కానీ, లోన్లు మంజూరు కాలేదన్నారు. వెంటనే బీసీ రుణాలు మంజూరు చేసి నిరుద్యోగ యువతీ యువకులను ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని, పలు బీసీ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టి తీసుకుపోయినట్లు సత్యనారాయణ తెలిపారు.

# సీఎం పర్యటన నియోజకవర్గానికి మంచి గుర్తింపు

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడానికి వరంగల్ కు విచ్చేస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టెక్స్ టైల్ పార్కును కూడా సందర్శించాలని కోరిన వెంటనే అంగీకరించి టెక్స్ టైల్ పార్కు కు వచ్చి పనుల పరిశీలించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని యాజమాన్యానికి ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్క్ లో ఎంతమంది రైతులు భూమిని కోల్పోయారు, దానికి అనుగుణంగా నష్టపరిహారం అందనివారు ఎవరైనా ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారం అందనివారికి వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాలతో టెక్స్ టైల్ పార్క్ మునిగిపోయిందని వివరించగా, అలాంటి సమస్య మళ్లీ తలెత్తకుండా అందులోనే సుమారు 5 ఎకరాల నుంచి 10 ఎకరాల భూమిని పాండ్ నిర్మించుటకు కేటాయించాలని సీఎం అధికారులను ఆదేశించారని తెలిపారు. వస్త్ర పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులకు ఇళ్ల స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని, భూ నిర్వాసితులకు రూ.5 లక్షలు చొప్పున వెచ్చించి, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అన్ని వసతులు కల్పించాలని, ఇళ్ల స్థలాల ప్రాంతాన్ని అభివృద్ధి చేసి విద్యుత్, తాగునీరు, రోడ్లు ,డ్రైనేజీ తదితర సదుపాయాలు ఏర్పాటుచేయాలన్నారు. టెక్స్టైల్ పార్కు ప్రాంతం ఒక మోడల్ గ్రామంగా తీర్చదిద్ది అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, పట్టణ వాతావరణాన్ని కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు కొత్తగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి, పార్కు కోసం భూములు ఇచ్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, కంపెనీ యజమాన్యానికి తాను హామీ ఇచ్చానన్నారు. స్థానికులకే 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరానన్నారు. టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన పూర్తి వివరాలతో అధికారులు నివేదికను సిద్ధం చేయాలని, అవసరమైన నిధులు మంజూరు చేసి సహకరిస్తానని సీఎం అన్నారని ఎమ్మెల్యే రెడ్డి రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ అధ్యక్షుడు కోయ్యడ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ అనిత రామకృష్ణ, పరకాల మండల అధ్యక్షుడు కటుకూరి దేవేందర్ రెడ్డి, నడికూడ మండల అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, పరకాల ఎంపీపీ మాజీ జడ్పీటీసీ పాడి కల్పనాదేవి, ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


## పల్లా రాజేశ్వర్ రెడ్డి, రాకేష్ రెడ్డిల అరెస్ట్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గాంధీ హాస్పిటల్‌లో నిరాహార దీక్ష కొనసాగిస్తున్న విద్యార్థి నాయకుడు మోతీలాల్‌నాయక్‌ను పరామర్శించడానికి వెళ్తున్న పల్లా రాజేశ్వర్ రెడ్డిని, రాకేష్ రెడ్డిలను పోలీస్ లు అరెస్టు చేశారు. బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్ వాహనంలో ఏనుగుల రాకేష్ రెడ్డిని బొల్లారం పోలీస్ స్టేషన్ కు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని చంద్రాయన్ గుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. వీరితో పాటు మరో 50మంది బీఆర్ఎస్ నాయకులు, టీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుల అరెస్టయ్యారు. ప్రభుత్వ తీరుపై, పోలీస్ ల అత్యుత్సాహంపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి నాయకుడిని పరామర్శించే స్వేచ్ఛ కూడా లేదా అని ప్రశ్నించారు. ప్రజా పాలన అంటే ఇదేనా ? మూడు రోజులు మురిపించి ఇచ్చిన హామీలు మరిచి సీఎం, మంత్రులు ఢిల్లీ టూర్లు, పదవుల పంపకాలలో ప్రయివేటు కార్యక్రమాలతో ఊరేగుతున్నారని వ్యాఖ్యానించారు.ఒక ఎమ్మెల్యే అని చూడకుండా నన్ను, ఎమ్మెల్సీగా పోటీ చేసిన ఒక రీకగ్నైజేషన్ ఉన్న నాయకుడు రాకేష్ రెడ్డిని బలవంతంగా తరలించడం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ పోకడకు అద్దం పడుతుందన్నారు.

## హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి

### డీబీఎఫ్ ఆధర్యంలో కలెక్టర్‌కు వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, నాలుగు జతల దుస్తులతో పాటు కనీస సౌకర్యాలైన టాయిలెట్, బాత్రూమ్స్, తాగునీరు మేరుగు పరిచి, పౌష్టికాహారం అందించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం ఇస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్య పరీక్షలు ప్రతి నెల చేయించాలన్నారు. విద్యార్థులకు అందించే కాస్మోటిక్ చార్జీలను పెంచి ప్రతినెల వారిగా అందించాలన్నారు.హాస్టల్‌లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్రతి హస్టల్ కు ఇంచార్జి వార్డన్ కాకుండా పర్మినెంట్ వార్డెన్ ను నియమించాలని,అధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, సహాయ కార్యదర్శి పోలేపాక మల్లేశం, జిల్లా నాయకులు మోరే అయిలయ్య, రాజు, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరూ అవగాహన పెంచుకొని జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ కంచి విద్యాసాగర్ అన్నారు. సోమవారం కరీమాబాద్ గవర్నమెంట్ హై స్కూల్ లో దాదాపు 150 మంది విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అన్నోన్ నెంబర్స్ నుంచి మహిళలకు ఎవరి నుండైన ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా షీ టీమ్ వారికి సమాచారం ఇవ్వాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 కి ఫిర్యాదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి చర్య తీసుకుంటామని తెలిపారు. మహిళలుకు సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, అలా పంచుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలో నివారించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరీమాబాద్ ప్రభుత్వ హైస్కూల్ ఇంచార్జి హెడ్ మాస్టర్ మురళి, ఉపాధ్యాయులు, షీ టీమ్ నుంచి ఎస్ఐ విద్యాసాగర్, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుల్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అవసరార్థులకు సేవ భగవంతుడి సేవే




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అవసరార్థులకు, అనాథ విద్యార్థులకు సేవ చేయటం భగవంతుడికి సేవ చేసినట్లేనని ప్రముఖ వ్యాపారవేత్త, సంజీవిని మెడికల్ స్టోర్స్ అధినేత రేణుకింది శ్రీనివాస్ అన్నారు. రికార్డ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండ 10వ డివిజన్ లోని వేడుకల మందిరంలో నిర్వహించిన నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి రికార్డ్ సర్వీస్ సొసైటీ అనేక సేవా కార్యక్రమాలతో పాటు నగరంలో చిరుధాన్యాల పట్ల అవగాహన కోసం ప్రత్యేకించి మహిళలకు మిల్లెట్స్ వంటకాల అవగాహన, తయారు చేసే విధానాలపై సొసైటీ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత నేతృత్వంలో త్రినగరిలోనే కాక వివిధ జిల్లాలలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్షుడు కుసుమ సురేష్ మాట్లాడుతూ రానున్న రోజులలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు సేవ చేయాలన్నది తమ సొసైటీ లక్ష్యమన్నారు. చిరుధాన్యాల సాగుపై జిల్లాలోని కొన్ని మండలాలను దత్తత తీసుకొని రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథుల చేతుల మీదుగా పేదవిద్యార్థులకు సుమారు రూ. 8 వేల విలువైన నోటు పుస్తకాలు పంపిణీ చేయించి వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయిత వేణుగోపాల్, కుసుమ రమేష్, కుసుమ ప్రకాష్, శ్రీనివాస్, పిచ్చిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల పూర్తి సమాచారాన్ని తెలిపే వెబ్ సైట్ ను అతిథులు ఆవిష్కరించారు.

## నెలలు గడిచినా అందని ఉపాధి డబ్బులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** ఉపాధి హామీ పథకంలో పనులు చేసి నెలలు గడుస్తున్నా ఇంకా బ్యాంక్ ఖాతాలలో ఉపాధి హామీ డబ్బులు పడలేదు అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలల్లో మండు వేసవిలో ఎండని సైతం లెక్క చేయకుండా ఉపాధి పనులు నిర్వహించామని కానీ ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం డబ్బులు అందలేదని, వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం డబ్బులు కూలీలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. మండలంలో ఒక్కో ఉపాధి కూలీకి సగటున 6 నుండి 7 వేల రూపాయల ఉపాధి కూలీ రావాల్సి ఉంది.

## లెప్రసీ విభాగంలో సేవలు ప్రశంసనీయమం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సుదీర్ఘ కాలం వైద్య ఆరోగ్యశాఖలోని లెప్రసి విభాగంలో సేవలందించడం ప్రశంసనీయమని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మదన్ మోహన్ రావు అన్నారు. సోమవారం డిప్యూటీ పారా మెడికల్ అధికారులుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఏ.గోపాల్ రెడ్డి, ఇమ్మడి కొమురయ్యలకు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ వీరు లెప్రసీ నిర్మూలనకు కృషి చేసిన తీరు అభినందనీయమన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎండీ.యాకూబ్ పాషా మాట్లాడుతూ మానవ సేవ యే మాధవ సేవగా భావించి లెప్రసీ కేసులను గుర్తించడం, చికిత్స అందించడం, కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేయడం వంటివి, చాలా గొప్ప సేవ అని, వీరి ఇరువురు తమ ఉద్యోగ ధర్మాన్ని చిత్త శుద్ధితో నిర్వహించారన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమ బిందు, జిల్లా ఇమ్మ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఇఫ్టర్ అహ్మద్, హసన్ పర్తి వైద్యాధికారి డాక్టర్ ప్రభు దాస్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి చంద్ర కళ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాస్, ఫిజియో థెరపిస్ట్, ఎస్ఓ ప్రసన్న కుమార్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో ప్రజలు అందించిన ఫిర్యాదులను పరిష్కరించే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య జిల్లా అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించిన కలెక్టర్ ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 165 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కె.నారాయణ, వెంకటేష్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లంబాడీల ఐక్యవేదిక లైవ్ అసెంబ్లీ సెక్రటరీగా తేజావత్ రాంమూర్తి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** డోర్నకల్ నియోజకవర్గం సిరోల్ మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన లంబాడీల ఐక్యవేదిక లైవ్ అసెంబ్లీ సెక్రటరీగా తేజావత్ రాంమూర్తి నాయక్ నియమితులయ్యారు. లంబాడీల ఐక్యవేదిక జాయింట్ సెక్రెటరీ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్ జాదవ్, చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ నాయక్ లు, లంబాడీల ఐక్యవేదిక లైవ్ అసెంబ్లీ సెక్రటరీగా నియాకమకమైన తేజావత్ రాంమూర్తి నాయక్ కు నియామక పత్రం అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు,స్నేహితులు, బంధువులు, తోటి సహచరులు కుటుంబసభ్యులు తేజావత్ రాంమూర్తి నాయక్ కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తేజావత్ రాంమూర్తి నాయక్ మాట్లాడుతూ తనను నియమించిన రాజ్ కుమార్ జాదవ్ రమేష్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. లంబాడీలు విద్య,వైద్య,ఉద్యోగం రాజకీయ ఇతర అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,యువతను ప్రగతి చైతన్యం చేయడానికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు.

## డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ రాయల్స్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎంజీఎం సూపరెండెంట్ డాక్టర్ వలుపదాసు చంద్రశేఖర్ కు శాలువా కప్పి, బోకే, స్వీట్స్ ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లయన్ దీటి వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షులు లయన్ వలుపదాసు శ్యామ్ సుందర్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## వైద్యుల సేవలు అమూల్యమైనవి

### నిహిర హాస్పిటల్‌లో ఘనంగా డాక్టర్స్ డే



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** స్థానిక నిహిర హాస్పిటల్ లో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ముప్పిడి దిలీప్ కుమార్, డాక్టర్ రోహిణి, ప్రియాంక రెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముప్పిడి దిలీప్ కుమార్, ప్రియాంక రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. బాధల నుంచి, విపత్తుల నుంచి ప్రాణాన్ని కాపాడే ప్రత్యక్ష దైవాలే డాక్టర్లు అని, కరోనా క్లిష్ట సమయంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆరోగ్య విపత్తుల కాలంలో వైద్యుల సేవలు త్యాగపూరితమైనవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, హాస్పిటల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

## కూరపాటి రమేష్‌కు డాక్టర్స్ డే అభినందనలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశం అభివృద్ధి పదంలో నడవాలంటే ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉత్పత్తిలో భాగస్వాములు అవుతారని, అందుకు వైద్యో నారాయణ అని నానుడి ఉందని, దీనిని నిజం చేస్తున్న కూరపాటి హాస్పిటల్ యజమాని కూరపాటి రమేష్ ను భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి కలిసి పూల బొకే ఇచ్చి డాక్టర్స్ డే అభినందనలు తెలిపారు. ప్రభుత్వ వైద్యంతో పాటుగా పేదలకు సరసమైన ధరలలో వైద్యాన్ని అందిస్తామని నిజమైన నిరుపేదలకు మరింత తగ్గింపుతో వైద్యం అందజేస్తామని డాక్టర్ రమేష్ హామీ ఇచ్చారు. అందుకు నేదునూరి జ్యోతి అభినందనలు తెలియజేశారు. నేదునూరి రాజమౌళి, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి మెడికల్ ట్రిప్పు ప్రవీణ్ కుమార్ అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఎస్పీని కలిసిన ఏఎస్ఐ శ్రీనివాస్ రావు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఏఎస్ఐగా పదోన్నతి పొందిన పి.శ్రీనివాస్ రావు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్ రావు ఏఎస్ఐగా పదోన్నతిపై మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చారు.

## పొగాకు ఉత్పత్తుల అమ్మకం నేరం




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ఏనుగల్ గ్రామంలోని కేకే కిరాణం షాప్ లో నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్మతుండటంతో షాప్ యాజమాని కానుగంటి తిరుపతిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిపై కేసు నమోదు చేపసి రూ. 8295 విలువ గల అనార్, ఆర్ఆర్ టొబ్యాకో ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐ జి. వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్లు కూరపాటి రమేష్, రాధికలకు సన్మానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** డాక్టర్స్ డే ని పురస్కరించుకొని యూబ్లడ్ యాప్, జై స్వరాజ్య వరల్డ్ టీవీ సంయుక్త సౌజన్యంతో, చిలువేరు శంకర్ ఆధ్వర్యంలో సీనియర్ డాక్టర్స్ డా.కూరపాటి రమేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డా.కూరపాటి రాధికలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా, సీనియర్ సర్జన్ డా.కూరపాటి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పేషెంట్ విషయంలో డాక్టర్ పాత్ర అనేది చాలా ముఖ్యమైనదనీ పేర్కొన్నారు. అదేవిధంగా సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్.కూరపాటి రాధిక ట్లాడుతూ ఆప్తత్కాల సమయంలో రోడ్డు ఆక్సిడెంట్ రూపేణ, లేదా తలసేమియా సమస్యలతో బాధపడుతున్న పేషంట్స్ గురించి లేదా వేరే ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేషంట్స్ కు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారిని పూర్తి ఆరోగ్యంగా తీసుకు వచ్చే సమయంలో డాక్టర్స్ పడే శ్రమ అంత ఎంత కాదని డాక్టర్స్ డే సందర్భంగా గుర్తు చేశారు. ఈ సందర్భంగా యూ బ్లడ్ యాప్ పోస్టర్లను డాక్టర్ల బృందం ఆవిష్కరించారు. యూబ్లడ్ యాప్ సృష్టికర్త డా. జగదీష్ బాబు యలమంచిలిని డాక్టర్స్ బృందం, స్టాఫ్ ప్రత్యేకంగా అభినందించారు.

## బుర్ర అపర్ణకు డాక్టరేట



**వరంగల్ వాయిస్, జనగామ :** మండలంలోని ఓబుల కేశవాపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర శంకరయ్య గౌడ్ లక్ష్మీ దంపతుల పుత్రిక బుర్ర అపర్ణ పీహెచ్‌డీ పట్టభద్రురాలైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆమె సమర్పించిన ఫిజిక్స్ విభాగం పరిశోధన అంశం పై పీహెచ్ డీ అవార్డును ఉస్మానియా విశ్వ విద్యాలయం ఎగ్జామినేషన్ అదనపు కంట్రోలర్ ప్రకటించారు. అపర్ణ గురువు ఉస్మానియా విశ్వ విద్యాలయం ఫిజిక్స్ ప్రొఫెసర్ డా. కలీం అహ్మద్ జలీలి మార్గదర్శనంలో "ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ఎన్ఐ -ఎంజీ-జీడీ అండ్ కో-జడ్ ఎన్-జీడీ నానో ఫెర్రిటీస్" అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. సాధారణ విద్యార్థులు పీహెచ్ డీ కోసం పరిశోధన చేయడం సహజం, కానీ పెళ్ళై భర్త లగ్గాల అంజనేయులు గౌడ్, రిషిత్ గౌడ్ అనే 18 నెలల కుమారుడు గల అపర్ణ చేయడం ఆమె పట్టుదలకు నిదర్శనంగా చెప్పవచ్చు. జన్మస్థలంలో పదో తరగతి వరకు చదివిన అపర్ణ జనగామ ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఏకశిలా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి నిజాం కళాశాల హైదారాబాద్ లో ఎం.ఎస్ సీ పూర్తి చేశారు.

# రహీం సేవలు మరువలేనివి

### ఘనంగా సన్మానించిన వి.రామంచంద్రం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో గత కొన్ని సంవత్సరాల నుంచి ఉద్యోగం చేస్తూ నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న రహీంకు కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ వి.రామచంద్రం సోమవారం దూరవిద్య కేంద్రంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహీం సేవలు దూరవిద్య కేంద్రానికి ఎంతో ఉపయోగపడ్డాయని, తాను ఉద్యోగ రీత్యా సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు ఉద్యోగులకు తన వంతు సహకారాలు అందిస్తూ ఉద్యోగులకు ఎంతగానో పని చేశారని, తన సేవలు దూరవిద్య కేంద్రం మరువలేనివని ఆయన అన్నారు. దూర విద్యలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ రహీంను ఆదర్శంగా తీసుకొని విధులు నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు, విద్యార్థులకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించే విధంగా అందరూ దూరవిద్య అభివృద్ధికి కృషి చేయాలని సంచాలకులు ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్టర్ నరసింహారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంఘాని మల్లేశ్వర్, నల్లని శ్రీనివాస్, వి.జగన్, డాక్టర్ కొట్టే భాస్కర, డిప్యూటీ డైరెక్టర్, ఉద్యోగ సంఘం నాయకులు, దూర విద్య ఉద్యోగులు అందరూ పాల్గొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

## డాక్టర్, ఆడిటర్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్. ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఆయుర్వేద వైద్యశాలలో గత 30 సంవత్సరాల నుంచి రోగులకు సేవలందిస్తూ ఇప్పటికీ ఇంకా వైద్య వృత్తి కొనసాగిస్తూ ఎంతో మందికి వైద్యం చేస్తునన ఉన్న సందర్భంగా డాక్టర్ పిట్ట యాదగిరిని సన్మానించారు. అలాగే ప్రముఖ చార్టెడ్ అకౌంటెడ్ త్రిపురాని గోపీచంద్ ను చార్టెడ్ అకౌంట్ డే సందర్భంగా ఘనంగా సన్మానించడం జరిగింది. వీరు గత 30 సంవత్సరాల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సేవలను అందిస్తున్నారని ట్రస్టీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ రాజేంద్రప్రసాద్ ట్రస్టీతో పాటు ఆర్గనైజర్ శ్రవణ్, మిట్టపల్లి సమ్మయ్య, రాజేష్, ప్రకాష్, రమ, విజయ పాల్గొన్నారు.

# కాల్వ కబ్జా చేసి.. 'రైతు బంధు' నొక్కేసి

**తోటి రైతు భూమి సైతం ఆక్రమణ**
**ఇదేంటని అడిగితే దాడులు, దౌర్జన్యం**
**పట్టా పాస్ బుక్ రద్దు చేయాలి**
**స్థానిక రైతుల డిమాండ్**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** దర్జాగా ఎస్సారెస్పీ కాల్వను కబ్జా చేశారు. అడ్డుగా ఇళ్లు నిర్మించి రాకపోకలు నిలిపివేశారు. అలాగే పక్కనే ఉన్న మరో రైతు భూమిని సైతం ఆక్రమించి, కబ్జా చేసిన కాల్వతో సహా అక్రమంగా పట్టా పాస్ బుక్ సృష్టించి 10 విడతలుగా రైతు బంధు సొమ్ము కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పర్వతగిరి మండలంలోని దౌలత్ నగర్ గ్రామం నుంచి ఇస్లావత్ తండా గ్రామానికి వెళ్లే దారిలో సర్వే నంబర్ 443, 444, 446 గల భూమిలో ఎస్సారెస్పీ ఉపకాల్వను 25ఏళ్ల క్రితం నిర్మించారు. బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించి సంబంధిత శాఖల అధికారులు భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇస్లావత్ హస్లీ కాల్వ పక్కనే భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. హస్లీ భూమి పక్కనే ఇస్లావత్ వాల్యకు ఒక ఎకరం పది గుంటల భూమి ఉంది. అందులో ఉన్న భారీ వృక్షాలను తొలగించేశారు. అయితే ధరణి పుణ్యమా అని కొనుగోలు చేసిన భూమితో పాటు ఇస్లావత్ వాల్యకు చెందిన భూమిని, ఎస్సారెస్పీ ఉప కాల్వ భూమిని తన పేర అక్రమంగా పట్టా చేయించుకున్నారు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న రైతు బంధు సొమ్ము సైతం ఇస్లావత్ హస్లీ అక్రమంగా నొక్కేస్తుంది. ఈ సందర్భంగా ఇస్లావత్ వాల్య తన భూమిలో సాగు చేసేందుకు వెళ్లగా హస్లీ కుటుంబ సభ్యులు ఇస్లావత్ లుంబా, అతని కుమారులు ఇస్లావత్ బాలు, వెంకన్న, కోడళ్లు సునీత, ఉమా రాణి దాడికి పాల్పడ్డారు. కాల్వ పై నుంచి వెళ్లేందుకు సైతం దారి లేక మొత్తం దున్నేశారు. ఇదే విషయాన్ని స్థానిక ఎస్సైకి బాధిత రైతు వాల్య తెలుపగా భూ సంబంధిత సమస్యలకు తహసీల్దార్ ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయానికి వాల్య వెళ్లి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఎస్సారెస్పీ ఉపకాల్వను కబ్జా చేసిన ఇస్లావత్ హస్లీతో పాటు కుటుంబ సభ్యులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. అలాగే అక్రమంగా పొందిన పట్టా పాస్ బుక్ ను రద్దు చేసి, 10 విడతలుగా రైతు బంధు సొమ్ము కాజేసిన నగదును రెవెన్యూ యాక్ట్ ప్రకారం రికవరీ చేయాలని తోటి రైతులు కోరుతున్నారు. ఇదే విషయంపై మండల ఐబీ ఏఈ ప్రశాంత్ ను మీడియా ఫోన్ లో సంప్రదించగా కాల్వ కబ్జా చేసినట్లు సమాచారం ఉందని, ప్రస్తుతం తాను సెలవులో ఉన్నానని చెప్పారు.

### అక్రమ పట్టాను రద్దు చేయాలి

**- వాల్య , బాధిత రైతు**

25 ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ ఉప కాల్వ కింద నా భూమి ఇచ్చా. సర్వే నంబర్ 444, 446 లో ఒక ఎకరం పది గుంటల భూమి ఉండగా కాల్వకు పోగా మిగిలిన ఎకరం భూమి కబ్జాకు గురైంది. కాల్వ భూమితో పాటు నా సొంత జాగా సైతం ఆక్రమించి అక్రమంగా పట్టా చేసుకున్నారు. ఇదేంటని అడిగితే హస్లీ కుటుంబ సభ్యులు దాడికి పాల్పడుతున్నారు. అధికారులు విచారణ చేపట్టి అక్రమ పట్టాను రద్దు చేసి నాకు న్యాయం చేయాలి.

## సీపీఆర్ ప్రక్రియపై అవగాహన

### పోస్టల్ కవర్ విడుదల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** డాక్టర్స్ డే సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని చారిత్రాత్మక పోస్ట్ ఆఫీసులో, ఛాతి నొప్పి వచ్చి గుండె ఆగిపోయిన సందర్భంలో సీపీఆర్ ప్రక్రియపై ప్రచారం, అవగాహన కల్పించే విషయం గురించి ఒక పోస్టల్ కవర్ ను విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జోన్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత హాజర్రై పోస్టల్ కవర్ విడుదల చేశారు. గత రెండు దశాబ్దాలుగా, అత్యవసర అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిన సమయంలో చేయవలసిన ప్రథమ చికిత్స (సీపీఆర్ -కార్డియో పల్మనరీ పునర్జీవనం) ప్రక్రియ గురించి క్యాంపులు నిర్వహిస్తూ, కలశాలలో, యూనివర్సిటీల్లో అవగాహన కల్పిస్తూ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న హనుమకొండకు చెందిన కార్డియాలజీ డాక్టర్.రామక శ్రీనివాస్, తపాల శాఖ సహకారంతో ఈ పోస్టల్ కవర్ తయారు చేయించాడు. ఆల్ ఇండియా రేడియోలో రిపోర్టర్ ప్రఖ్యాత తెలుగు వ్యాఖ్యాత దక్షిణ మూర్తి, డాక్టర్ శ్రీనివాస్ చేస్తున్న కృషి గురించి డాక్టర్ గా ఆయన ప్రతిభ గురించి వివరించారు. పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ నిస్వార్థంతో చాలా కాలంగా సీపీఆర్ విషయంలో అవగాహన కల్పించడానికి చేస్తున్న కృషిని కొనియాడారు. తపాలాశాఖ కూడా ప్రజల సేవాసంస్థ అని, మా సంస్థతో కలిసి అవగాహన పెంపొందించడానికి ఆయన ముందుకు రావడం సంతోషకరమన్నారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్.జీవన్ కుమార్, డా. శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలు, ఆయన పొందిన పురస్కార విషయాలను వివరించి, ఆయన సేవాభావాన్ని ప్రశంసించారు. ఈ ప్రక్రియ పట్టణ ప్రాంతాలలోనే కాక గ్రామ సీమల్లో కూడా ప్రచారం చేసి, ప్రజల్లో అవగాహనను పెంచే ప్రయత్నం జరగాలి, ఇందు కోసం చాలా మంది డాక్టర్లు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.సుబ్రమణ్యం, పోస్టల్ యూనియన్ నాయకుడు సీహెచ్.ప్రతాపరెడ్డి, సీనియర్ మెడికల్ రిప్రెజెంటేటివ్, మెడికల్ కౌన్సిలర్ పి.భరత్, ఎస్ బీఐ చీఫ్ మేనేజర్ (రిటైర్డ్) వి.రాంచంద్రారెడ్డి, ఇతర పోస్ట్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. సీపీఆర్ ప్రక్రియ గురించి వివరించే కరపత్రాలు అక్కడ అందుబాటులో ఉంచారు.

## పేద విద్యార్థులకు దాతల సహకారం ఉపయోగకరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నిరుపేద విద్యార్థులకు దాతల సహకారం ఎంతో ఉపయోగకరమని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ( కో-ఎడ్యుకేషన్) ప్రిన్సిపాల్ ఎస్.ధర్మేంద్ర అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో-ఎడ్యుకేషన్)లో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అధ్యక్షతన, ఇండియన్ ఏజెన్సీ వ్యవస్థాపకులు, ఏవీవీ కాలేజి వ్యవస్థాపక సభ్యుడు నేరెళ్ల ధనుంజయ, వారి కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.ధర్మేంద్ర మాట్లాడుతూ విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏవీవీ విద్యాసంస్థల వ్యవస్థాపక సభ్యులు నేరెళ్ల ధనుంజయ, వారి కుటుంబ సభ్యులతో కలిసి పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేయడం చాలా గొప్ప విషయమని, ఇలాంటి కార్యక్రమాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. నిరుపేద విద్యార్తులు క్రమశిక్షణతో చదివి, ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఇలాంటి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏవీవీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ రఘుపతి, కళాశాల సీనియర్ అధ్యాపకులు మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఏవీ రంగనాథ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని సీనియర్ ఐపీఎస్ ఏవీ రంగనాథ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

# దేశం కోసం తపించిన తాపసి శ్యామా ప్రసాద్ ముఖర్జీ

## వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి వర్ధంతి – జయంతి కార్యక్రమంలో భాగంగా సోమవారం కేఆర్ గార్డెన్స్ ఎదురుగా భారతీయ జనతా పార్టీ కార్యాలయం దేశాయిపేట్ రోడ్ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మల్లాడి తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డితో కలిసి వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం ముఖ్యఅతిథి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 33ఏళ్ల వయసులో కలకత్తా యూనివర్సిటీకి ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన వైస్–ఛాన్సలర్‌గా 1938 వరకు ఆ పదవిలో కొనసాగాడు. తన పదవీ కాలంలో, అతను పరిచయం చేశాడు. అనేక నిర్మాణాత్మక సంస్కరణలు, ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ కలకత్తాలో చురుకుగా పనిచేశారు. అలాగే బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కోర్ట్ మరియు కౌన్సిల్‌లో సభ్యుడిగా, ఇంటర్–యూనివర్శిటీ ఆఫ్ బోర్డ్ ఛైర్మన్‌గా ఉన్నారు. ముఖర్జీ 1939లో బెంగాల్‌లోని హిందూ మహాసభలో చేరారు. అదే సంవత్సరం దాని తాత్కాలిక అధ్యక్షుడయ్యారని, అతను 1940లో సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితుడయ్యాడని అన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ దేశాన్ని ఏకతాటిపై నడిపించాలని కలలు కన్న ఋషి, కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే భారతీయ జాతీయ కాంగ్రెసు విధానాన్ని ముఖర్జీ వ్యతిరేకించాడు. ఒక రాష్ట్రానికి ప్రత్యేక జెండా, ప్రధానమంత్రి ఉండటాన్ని తీవ్రంగా నిరసించాడు. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానమంత్రులు, రెండు జాతీయ పతాకాలు ఉండటాన్ని సహించలేమని పేర్కొన్నాడు. తమ దేశంలో నివసించడానికి ఒక రాష్ట్రంలో అర్హత లేకపోవడానికి, గుర్తింపు చూపవలసి రావడం తదితర కారణాల వల్ల 1953లో కాశ్మీర్ వెళ్లి నిరాహారదీక్ష చేయాలని నిర్ణయించి సరిహద్దు వద్ద మే 11 న అరెస్టు అయ్యాడు. అతని ప్రయత్నం వల్ల గుర్తింపు కార్డు నియమం తొలిగించబడిననూ అంతవరకు ముఖర్జీ సజీవంగా లేడు. జూన్ 23, 1953న కస్టడీలోనే ముఖర్జీ ప్రాణాలు వదిలాడు. జన సంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారికి సందర్భంగా ఆ మహానీయుడికి నమస్సుమాంజలులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, రానా ప్రతాపరెడ్డి, కంభంపాటి పుల్లారావు, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా నాయకులు, డివిజన్, మండల ఇంచార్జీలు, అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ ప్రొఫెసర్ వెలిశాల రాముకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగ సహాయ ఆచార్యులు వెలిశాల రాము, జేఎన్ టీయూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. డాక్టర్ రాము "ఇన్వెస్టిగేషన్ అండ్ ఇంప్లిమేంటేషన్ అఫ్ పల్స్ విడ్త్ మోడ్యులేషన్ స్ట్రాటజీస్ ఫర్ కాస్కేడ్ ముల్తిలేవెల్ ఇన్వర్టర్ (investigation and implementation of pulse width modulation strategies for cascade multilevel invertor)" అనే అంశంపై అ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ పి.సతీష కుమార్, ఆచార్య జి.ఎన్.శ్రీనివాస్ సంయక్త పర్యవేక్షణలో పూర్తి చేశారు. కొత్తగూడెం ఇంజినీరింగ్ కళాశాలలో సహాయ ఆచార్యులుగా పని చేస్తున్న డాక్టర్ వి.రామును పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# సెలూన్‌ను ప్రారంభించిన నన్నపునేని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాధికా థియేటర్ గల్లీలోని ఎలకంటి రోషన్ నూతన సెలూన్ అండ్ బ్యూటీ పార్లర్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై షాప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు టి.రమేష్ బాబు, ఎలకంటి సతీష్, కూచన రమేష్, పోలేపాక విజయ్, రాజేందర్ చారి, సింగరపు రమేష్, మామిడాల బాలు, 26వ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాతికేళ్ల మధుర జ్ఞాపకం

## గురువులను సత్కరించిన పూర్వ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో 1998–99 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఓ ప్రైవేటు వేడుకల మందిరంలో అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలిసి గురువులు, స్నేహితులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలం చేసిన గురువులకు విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ ప్రస్తుత కష్టాలు, సమస్యలను మర్చిపోయారు. 25 ఏళ్లు వెనక్కి వెళ్లి పాఠశాల స్థాయిలో చేసిన విధంగా ఆడుతూ, పాడుతూ సంబరాల్లో మునిగి తేలారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

# సానుకూల జీవనంతో మంచి ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, కేయూ :** సానుకూల జీవనంతో మంచి ఆరోగ్యమని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ కమిటీ హాల్ లో జూన్ 30న ఉద్యోగ విరమణ చేసిన కమతాన్ ఎం.సుజాత, ఉద్యోగ విరమణ సమావేశం సోమవారం నిర్వహించగా ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగ విరమణతో దొరికన ఆ కాస్త సమయాన్ని కుటుంబం కోసం, వ్యక్తిగత ఆసక్తులు, ఆరోగ్యం కోసం వెచ్చించాలన్నారు. మంచి జీవన విధానంతో ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయం నుంచి మంచి మంచి ఉద్యోగులు ఉద్యోగ విరమణ చెందటం ఒకింత బాధాకరం అన్నారు. ప్రస్తుత ఉద్యోగులు వారి వారి ఉద్యోగ అలవాట్లను అలవరచుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ ఆడిట్ డీన్ ఆచార్య జి.హనుమంతు, ఫైనాన్సు ఆఫీసర్ తోట రాజయ్య, సహాయ రిజిస్ట్రార్ లు డాక్టర్ కోలా శంకర్, డాక్టర్ మహమ్మద్ హబీబుద్దిన్, సూపరింటెండెంట్ ఎం.భాస్కర్, ఉద్యోగ సంఘాల నాయకలు, ఉద్యోగులు, సుజాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. శాలువా, జ్ఞాపికతో సుజాతను సన్మానించారు.

# గంజాయి క్రయవిక్రయాలు చట్టరీత్యా నేరం

## వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** గంజాయి అమ్మిన, కొన్న చట్టరీత్యా నేరమని వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ అన్నారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని తాళ్లపాడు సెంటర్ లో ఎస్ఐ జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వెంకటాపూర్ మండలం నారాయణగిరి పల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు సుమారు మధ్యాహ్నం 11గంటల నుంచి 12గంటల సమయం లో ద్విచక్ర వాహనం (పల్సర్ ) బండిపై వెల్తుర్లపల్లి గ్రామానికి వెళ్తున్న క్రమంలో పట్టుపడ్డాడు. సదురు యువకుడిని విచారించగా నారాయణగిరిపల్లి గ్రామానికి చెందిన యువకుడు బీజాపూరు నుంచి గంజాయి ని తీసుకుపోతున్ననట్టు తేలిందని ఎస్ఐ సతీష్ తెలిపారు. కాగా, సదురు యువకుడి వద్ద లభ్యం అయినా గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జక్కుల సతీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ గంజాయి అమ్మిన, కొన్న చట్టరీత్యా నేరమని అన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించిన, గంజాయి అమ్మిన వెంటనే పోలీస్లకి సమాచారం ఇవ్వాలని కోరారు.

# గోల్డెన్ కిడ్స్ పాఠశాల పాఠ్యపుస్తకాలు సీజ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పట్టణ కేంద్రంలో కొత్తవాడ ప్రాంతంలో ఉన్న గోల్డెన్ కిడ్స్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారన్న సమాచారం తెలియడంతో అధికారులను సంప్రదించగా మండల విద్యా కార్యాలయంలో పనిచేసే సీహెచ్ సువర్ణ పాఠశాలకు చేరుకుని అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న స్కూల్ పాఠ్యపుస్తకాల ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ హకీమ్ నవీద్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నియమ నిబంధనలు దొంగల తొక్కి అక్రమంగా పాఠశాలలో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారు. ఎలాంటి జీవోలు లేకున్నా ఉన్నాయని మాయమాటలు చెప్పి తల్లిదండ్రులను మోసం చేసి అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను అమ్ముతున్నారు. మండల విద్యాధికారులు ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాల పాఠ్య పుస్తకాల దందాను అరికట్టాలని, ప్రైవేట్ పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీజ్ చేసిన పాఠ్యపుస్తకాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలని అన్నారు. గోల్డెన్ కిడ్స్ పాఠశాల గుర్తింపు ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామఅన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ బీ జిల్లా అధ్యక్షుడు రోహిత్, ఏఐఎఫ్‌డీఎస్ వరంగల్ నాయకులు పోలబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సురేఖకు కలిసిన అహ్మద్ నదీమ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అహ్మద్ నదీమ్ సోమవారం సెక్రటేరియట్ లో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ అహ్మద్ నదీమ్ కు శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనం పెంపుదల, కాలుష్య నియంత్రణకు అమలు చేస్తున్న కార్యక్రమాలు, ఈ ఏడాది నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయంతంగా చేపట్టేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ, ప్రణాళిక తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.

# ఎస్ఐ శ్రీను ఆత్మహత్యాయత్నం

## పురుగుల మందు తాగిన వైనం




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎస్ఐ శ్రీరాముల శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు 108 కు ఫోన్ చేయడంతో హుటాహుటిన 108 సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకొని ఎస్ఐని 108 లో మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషం తెలిసిన ఎస్ఐ శ్రీను తల్లి , సోదరి హాస్పిటల్ వద్దకు చేరుకున్నారు. తమ కుటుంబంలో ఎలాంటి ఇబ్బందులు లేవని, తన కుమారుడు ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడో మాకు తెలియదని, తమ కుమారుడు ఆ స్టేషన్ కు పోయిన తర్వాతే చాలా బక్కపడ్డాడని, స్టేషన్ లో ఏం జరిగిందో తెలియడం లేదని, పోలీసులు మాకు ఏ విషయాలూ చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు ఎస్ఐ కుమారుడి జన్మదిన వేడుకలు ఉండగా ఈ సమయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో ఆ కుటుంబం ఆందోళనకు గురవుతోంది.

## ఇక హిందీలోనూ .. ఆకాశమే నీ హద్దురా..!

మహిళా దర్శకుల్లో సుధా కొంగరకు ప్రత్యేక శైలి ఉంది. ఆమె ఎంచుకునే కథలు, తెరకెక్కించే తీరు విభిన్నం. అందుకు ఆమె తెరకెక్కించిన చిత్రాలే నిదర్శనం. ప్రస్తుతం ఆమె 'సర్ఫిరా' సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. అక్షయ్ కుమార్ హీరోగా నటించిన ఈ చిత్రం సూర్య నటించిన 'ఆకాశం నీ హద్దురా'కు రీమేక్‌గా తెరకెక్కింది. జులై 12న విడుదలకానుంది. అయితే ఈ చిత్రం తర్వాత పైప్‌లైన్లో ఏ చిత్రం ఉందనే విషయాన్ని సుధా ఇప్పటిదాకా వెల్లడించలేదు. సూర్యతో 'పురాణనూరు' అనే చిత్రం చేయనున్నట్లు ఓ ప్రకటన వచ్చింది. అయితే అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే ఆ చిత్రం ఆగిపోయిందనే టాక్ కూడా నడుస్తోంది. కోలీవుడ్ మీడియా వార్తల ప్రకారం సుధా తదుపరి చిత్రం ధనుష్‌తో ఉంటుందని టాక్. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు, చర్చలు మొదలైనట్లు సన్నిహిత వర్గాల నుంచి సమాచారం. సూర్యతో చేయాల్సిన కథనే ధనుష్‌తో చే?న అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'సర్ఫిరా' విడుదల తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది. ధనుష్ ప్రస్తుతం 'రాయన్'తో సినీప్రియుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే శేఖర్ కమ్ముల దర్శకత్వంలో 'కుబేర' చిత్రంలో నటిస్తున్నారు.







## కలెక్షన్లలో దూసుకుపోతున్న కల్కి

### 4రోజుల్లోనే రూ.555 కోట్ల మార్క్ టచ్

టాలీవుడ్‌తో పాటు వరల్డ్ వైడ్‌గా కల్కి 2898 ఏడీ సత్తా చాటుతుంది. మొదటిరోజు నుంచే కలెక్షన్ల సునామీ సృష్టిస్తున్న ఈ చిత్రం నాలుగో రోజు కూడా అదే రిపీట్ చేసింది. పాన్‌ఇండియా స్టార్ హీరో ప్రభాస్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన ఈ సినిమాకు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించగా వైజయంతీ మూవీస్ తెరకెక్కించింది. ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో జూన్ 27 గురువారం ప్రేక్షకుల మందుకు వచ్చి మొదటి రోజు నుంచే భారీ వసూళ్లను రాబడుతుంది. ఓపెనింగ్ రోజే రూ.191.50 కోట్లు వసూల్ చేసిన సినిమా మూడు రోజుల్లోనే రూ.415 కోట్లు వసూళ్లను రాబట్టింది. ఇక తాజాగా ఆదివారం కలెక్షన్స్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా 4రోజుల్లోనే రూ.555 కోట్ల మార్క్ టచ్ చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో తెలుగు ఇండస్ట్రీలో రూ.500 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టిన చిత్రాలలో కల్కి ఐదో సినిమాగా నిలిచింది. ఇంతకుముందు ఈ రికార్డు బాహుబలి- 1, 2, ఆర్ఆర్ఆర్, సలార్ పేరిట ఉన్నాయి. విశేషం ఎంటంటే ఇందులో నాలుగు సినిమాలు ప్రభాస్‌వే కావడం విశేషం. మరోవైపు ఈ వారం టికెట్లు రేట్లు తగ్గనుండడంతో మూవీ కలెక్షన్లు మరింత పెరిగే అవకాశం ఉంది. సినిమాలో ప్రభాస్, దీపికా పదుకోణె, కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్, దిశా పటాని, రాజేంద్ర ప్రసాద్, శోభన తదితరులు ముఖ్యపాత్రల్లో నటించగా.. టాలీవుడ్ స్టార్ నటుడు విజయ్ దేవరకొండ అర్జునుడి పాత్రలో మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ ఒక యోధుడి పాత్రలో కనిపించాడు. ఇంకా వీళ్లే కాకుండా సీతారామం భామ మృణాల్ ఠాకూర్, మలయాళ నటి అన్నా బెన్, హాస్య నటుడు బ్రహ్మానందం, టాలీవుడ్ దర్శకులు ఆర్జీవీ, రాజమౌళి, జాతి రత్నాలు దర్శకుడు కేవీ అనుదీప్, ఫరియా అబ్దుల్లా, అవసరాల శ్రీనివాస్ తదితరులు ఇందులో నటించారు.


## కల్కి చిత్రానికి ఆదరణపై నాగ్ ధన్యవాదాలు

### ఇదో అరుదైన మూవీ అంటూ వీడియో విడుదల

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ' ప్రభంజనం సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా మంచి కలెక్షన్స్ సొంతం చేసుకుంటోంది. తాజాగా అమెరికన్ ఆడియన్స్‌కు దర్శకుడు కృతజ్ఞతలు చెప్పారు. ఓ ప్రత్యేక వీడియో విడుదల చేస్తూ.. సినిమాను ఆదరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 'మా నుంచి వచ్చే ప్రతి సినిమాకు అమెరికన్ ఆడియన్స్ చాలా సపోర్ట్‌గా నిలుస్తున్నారు. మంచి సినిమాకు అండగా ఉంటారు. అందరికంటే ముందుగా 'కల్కి'ని ఆదరించారు. వారి చిత్రంగా భావించి సపోర్ట్ చేశారు. మీ స్నేహితులను, బంధువులను కూడా కల్కికి తీసుకెళ్లండి. ఎందుకంటే ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. వీటిని బిగ్‌స్క్రీన్‌పై చూస్తే వచ్చే ఆనందం ఎప్పటికీ గుర్తుంటుంది. ఇప్పటికే థియేటర్లో చూసినవాళ్లు దీన్ని ఎక్స్‌పీరియన్స్ చేసుంటారు' అంటూ చిత్రాన్ని సపోర్ట్ చేస్తున్నందుకు నాగ్ అశ్విన్ థ్యాంక్స్ చెప్పారు. ఇక ఈ చిత్రం ప్రీ బుకింగ్స్ సేల్స్‌లోనే ఓవర్సీస్‌లో రికార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా వసూళ్ల విషయంలో కల్కి అక్కడ మరో ఘనత సాధించింది. నార్త్ అమెరికాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. ఇప్పటివరకు 11 మిలియన్ డాలర్లు వసూలు చేసింది. మొదటి వారంలోనే ఈ మార్క్‌ను చేరుకోవడం విశేషం. ఇంత తక్కువ సమయంలో ఏ భారతీయ సినిమాకు ఈ స్థాయి వసూళ్లు రాలేదని చిత్రబృందం తెలిపింది ఈ సినిమా మరెన్నో రికార్డులు సొంతం చేసుకోవడం ఖాయమని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ప్రభాస్‌తో పాటు అగ్రతారల నటనపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. విజువల్ వండర్‌గా ఉందంటూ చిత్రబృందాన్ని అభినందిస్తున్నారు.

## పంద్రాగస్ట్ రోజు రానున్న తంగలాన్





కోలీవుడ్‌తో పాటు పాన్ ఇండియా ప్రేక్షకుల ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రాలలో తంగలాన్ ఒకటి. తమిళ హీరో చియాన్ విక్రమ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు 'కబాలి', 'కాలా', 'సర్పట్ట పరంపర' చిత్రాల ఫేమ్ పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ రావడంతో పాటు సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఇక ఈ సినిమా విడుదల తేదీ ఎప్పుడు వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఈ మూవీ విడుదల తేదీపై ఒక సాలిడ్ అప్‌డేట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మూవీని ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయడానికి మేకర్స్ ఎలాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆగష్టు 15 రేసులో ఉన్న పుష్ప 6 డిసెంబర్‌కు వాయిదా పడగా.. ఆ స్థానంలో రామ్- పూరీ కాంబోలో వస్తున్న డబల్ ఇస్మార్ట్ వస్తుంది. ఇక ఆగష్టు 15 కి తంగలాన్ కూడా వస్తే బాక్సాఫీస్ క్లాష్ ఏర్పడే అవకాశం ఉంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువోతు ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. 'సర్పట్ట పరంపర' ఫేమ్ పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు. మరో ఇండియన్ మూవీ చరిత్ర సృష్టించనుందని' అని పేర్కొన్నారు. ఇప్పటికే దీని టీజర్‌కు భారీ స్పందన వచ్చింది. ఓ సందర్భంలో విక్రమ్ దీని గురించి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఏ సినిమా కోసం ఇంత కష్టపడలేదన్నారు. విభిన్నకథతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో గ్లామర్‌కు చోటులేదన్నారు. ఈ సినిమా చూస్తున్నంతసేపు ప్రేక్షకులు మరో ప్రపంచంలోకి వెళ్తారని హామీ ఇచ్చారు.

సోమవారం 01, జులై 2024
www.warangalvoice.net

# వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం

**జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లకు శుభాకాంక్షలు**

**పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**

**వరంగల్ వాయిస్, హైదారాబాద్ :** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. డాక్టర్లు బాధలనుంచి, విపత్తుల నుంచి ప్రాణాన్ని కాపాడే ప్రత్యక్ష దైవాలే డాక్టర్లు అని మంత్రి సీతక్క కొనియాడారు. కరోనా సహా అన్ని ఆరోగ్య విపత్తుల కాలంలో వైద్యుల సేవలు త్యాగపూరితమైనవని అన్నారు. రాష్ట్రంలో కరోనాను ఎదుర్కొనే క్రమంలో తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టి రోగులకు సేవలందించిన ప్రతి డాక్టర్‌కు, వారికి సహకరిస్తున్న కుటుంబ సభ్యులకు పేరు పేరునా మరోసారి అభినందిస్తున్నానని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, తెలంగాణను ఆరోగ్య తెలంగాణగా మార్చడమే ధ్యేయంగా, రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని ఈ సందర్భంగా మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య యజ్ఞంలో, వైద్య నారాయణులై తమవంతు పాత్రను పోషించాలని వైద్యులను కోరారు. ప్రజారోగ్యం కోసం తమ కృషిని మరింతగా కొనసాగించాలని రాష్ట్రంలోని ప్రతీ వైద్యుడికి మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. అన్ని స్థాయిల్లోని దవాఖానాల్లో మౌలిక వసుతులను మరింత మెరుగు పరిచామన్నారు. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్దిని తెలుపుతుందన్నారు. రానున్న కాలంలో ఖర్చుకు వెనుకాడకుండా రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. ఈ క్రమంలో డాక్టర్లు, నర్సులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సంక్షేమం కోసం, తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క ఉద్ఘాటించారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య సన్మానం**




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ లక్డికపూల్, హోటల్ అబోడ్ (శ్రీ వెంకటేశ్వర) హోటల్ లో ఆదివారం సాయంత్రం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యుల దినోత్సవ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మ ఇస్తారన్నారు. బాధలనుంచి, విపత్తుల నుంచి ప్రాణాన్ని కాపాడే ప్రత్యక్ష దైవాలే డాక్టర్లు అని ఎంపీ డా.కడియం కావ్య కొనియాడారు. కరోనా క్లిష్ట సమయంలో తాను వైద్యురాలిగా ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆరోగ్య విపత్తుల కాలంలో వైద్యుల సేవలు త్యాగపూరితమైనవని అన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, తెలంగాణను ఆరోగ్య తెలంగాణగా మార్చడమే ధ్యేయంగా, కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ–టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి.కాళీ ప్రసాదరావు, హౌనీ, రాష్ట్ర కార్యదర్శి డా.జె.విజయ్ రావు, హౌనీ.స్టేట్ ఫిన్ కార్యదర్శి డా.రాజేంద్ర కుమార్ యాదవ్, ప్రముఖ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.




# ఆబాద్ లయన్స్ క్లబ్‌కు అవార్డులు

**జిల్లాలో బెస్ట్ రీజియన్ చైర్మన్‌గా రాజశేఖర్ రెడ్డి**

**సెకండ్ బెస్ట్ అధ్యక్షుడిగా శ్రీభాష్యం రఘు**

**వరంగల్ వాయిస్, జనగామ :** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ 320ఎఫ్ జిల్లా లో గల 8 రీజియన్ లలో బెస్ట్ రీజియన్ చైర్మన్ గా జనగామ ఆబాద్ క్లబ్ కు చెందిన లయన్ కదిరె రాజశేఖర్ రెడ్డికి అవార్డు లభించింది. ఆదివారం రాత్రి వరంగల్ లోని బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో జరిగిన జిల్లా అవార్డ్స్ నైట్ సభకు జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హెచ్ రాజిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి అవార్డు ప్రదానం చేశారు. 200 లో లయన్స్ సంస్థలో చేరిన రాజశేఖర్ రెడ్డి 2013 –14లో జనగామ ఆబాద్ క్లబ్ అధ్యక్షుడిగా సేవ చేశారు. అనంతరం 2022–23లో జోన్ చైర్మన్ గా పనిచేసే అప్పటి జిల్లా గవర్నర్ కన్నా పరశు రాములుచే ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో రీజియన్ చైర్మన్ గా ప్రథమ స్థానంలో నిలిచారు. ఆబాద్ క్లబ్ అధ్యక్షుడు శ్రీభాష్యం రఘు జిల్లాలో గల 90 క్లబ్ లలో సెకండ్ బెస్ట్ అవార్డు నందుకున్నారు. అన్న ప్రసాద వితరణ, మెంబెర్షిప్ గ్రోత్ లో ప్రత్యేక అవార్డులందుకోగా, ఈ క్లబ్ కు చెందిన గ్లోబల్ యాక్షన్ టీం సర్వీస్ విభాగం నాయకుడు వి.ప్రసాద్ రావు, గ్లోబల్ యాక్షన్ టీం విస్తరణ విభాగం నాయకుడు ఏ.భిక్షపతి, ఇంకా ఈ క్లబ్ కోశాధికారి ప్రవీణ్, జిల్లా చైర్మన్లు పబ్బ చంద్రశేఖర్, నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర రావు, పులుగం సురేశ్ లు కమిటెడ్ లీడర్ అవార్డులు అందుకున్నారు. అవార్డులు సాధించిన నాయకులను క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ లు డా.డి.లవకుమార్ రెడ్డి, కన్న పరశురాములు, నూతన అధ్యక్షుడు డా.పి.నాగేశ్వర రావు, ఇతర సభ్యులు అభినందించారు.

# స్మార్ట్ సిటీ పనుల గడువు పొడగింపు కేంద్రం ఉత్తర్వులు జారీ

**కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌కు కృతజ్ఞతలు**

**వరంగల్ ఎంపీ కడియం కావ్య**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్మార్ట్ సిటీ మిషన్ ను 2025 మార్చి వరకు పొడిగించేందుకు కేంద్రం ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ గత నెల 24న ఢిల్లీలో కేంద్ర కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు కొన్ని పూర్తి చేయగా, చాలా వరకు పెండింగ్ లో ఉన్నందున కాలపరిమితిని మరో ఏడాది వరకు పొడిగించాలని ఎంపీ డా.కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం స్మార్ట్ సిటీ మిషన్ 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. ఇక వరంగల్ ప్రజలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్ నగరాన్ని స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరి తరుపున ఎంపీ కడియం కావ్య కేంద్ర మంత్రి కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్యాన్ని పరిరక్షించుకోండి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పదవీ విరమణ అనంతరం పోలీస్ అధికారులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ విభాగంలో సుధీర్ఘకాలంగా విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పదవీ విరమణ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని, పదవీ విరమణ చేస్తున్న ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రవి, యాదగిరి, ఏఎస్ఐలు సాంబయ్య, ప్రభాకర్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాతుడుతూ సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో పనిచేయడంమే కాకుండా క్లిష్ట సమయాల్లో విధులు నిర్వహించి నేడు శాంతియుతమైన వాతరణం కల్పించడంలో వీరు ప్రధాన కారుకులని, నేటి తరం పోలీసులకు వీరు స్పూర్తిగా నిలుస్తారని అన్నారు. ముఖ్యంగా పోలీసులు తమ విధుల్లో రాణించడం ప్రధాన కారణం వారి కుటుంబ సభ్యులని, కుటుంబ సభ్యులు ఇచ్చిన సహకారంతోనే పోలీసులకు అప్పగించిన పనుల్లో రాణిస్తున్నారని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్, ఆర్ఐలు శ్రీధర్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్‌కుమార్‌తో పాటు పదవీవిరమణ పోందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

**జనగామ కలెక్టరేట్‌లో కలకలం**



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కలెక్టరేట్‌లో ఓ మహిళా రైతు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఇటీవలే భూ వివాదం నేపథ్యంలో ఓ రైతు పురుగుల మందు తాగి కలెక్టరేట్ భవనం పైకెక్కి బలవన్మరణానికి ప్రయత్నించాడు. ఆ సంఘటన మరవక ముందే తాజాగా జనగామ జిల్లా నర్మెట మండలానికి చెందిన దేవరపల్లి జ్యోతి తన వ్యవసాయ భూసమస్య విషయమై ఆత్మహత్యాయ త్నానికి ప్రయత్నించడం అధికార వర్గాల్లో ఆందోళన కలిగించింది. భూ వివాదంలో జ్యోతి గత కొద్ది రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా, పట్టించుకోవడం లేదని మనస్థాపం చెంది సోమవారంఉదయం కలెక్టరేట్ లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయ త్నానికి ప్రయత్నించింది. అది గమనించిన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. అయితే అప్పటికే ఇంటివద్ద నిద్ర మాత్రలు మింగి ఇద్దరు పిల్లలతో కలిసి కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణికి జ్యోతి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం జ్యోతిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com